నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను ఈ నెల 28న మండల, మున్సిపల్, డివిజన్‌స్థాయిల్లోనూ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

దారు(లు)ణం..!

అస్తవ్యస్తంగా రహదారులు
ఏలూరు నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా ఇదే దుస్థితి
వర్షాలకు రోడ్లపై రాకపోకలు సాగించలేని పరిస్థితి
జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎదుటే ఎంఎల్ఎలు గగ్గోలు
కొత్తగా నిధుల కేటాయింపు లేదంటున్న ఆర్అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'2025 సంక్రాంతికి రోడ్లపై గుంతలు లేకుండా చేస్తాం' అంటూ కూటమి ప్రభుత్వం అప్పట్లో తెగ ఊదరగొట్టింది. సంక్రాంతి వెళ్లి ఏడు నెలలు గడిచినా ఇప్పటికీ రోడ్ల పరిస్థితిలో మార్పు లేకుండాపోయింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని రోడ్లపై గుంతలు పూడ్చి మమ అన్పించేసిన పరిస్థితి ఉంది. వర్షాలకు నీరు నిలిచిపోయి జనం నరకయాతన పడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 3,200 కిలోమీటర్ల వరకూ ఆర్అండ్‌బి రహదారులు ఉండగా, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఇతర రోడ్లు ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో జనంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో తాము అధికారంలోకి వస్తే రోడ్ల వ్యవస్థను బాగు చేస్తామని కూటమి నేతలు ఊదరగొట్టారు. కూటమి అధికారంలోకొచ్చాక రోడ్లపై గుంతలు పూడుస్తున్నామంటూ తెగ హడావుడి చేసింది. కొన్ని రోడ్లకు మర్మమతులు చేసి వదిలేసింది. కొన్ని రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు కాగితాల్లో చూపించడం తప్ప పనులు మాత్రం ఇప్పటికీ ప్రారంభించలేదు. ఏలూరు నగరంలోని వంగాయగూడెం కేన్సర్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు అత్యంత దారుణంగా తయారైంది. మోటారు సైకిళ్లు సైతం వెళ్లలేని పరిస్థితి. పనులు మొదలయ్యాయని చెప్పడం తప్ప రోజులు గడిచిపోతున్నా గుంతలు మాత్రం పూడ్చలేదు. ఏలూరు నడిబొడ్డున ఉన్న సెంట్ఆన్స్ కాలేజీ రోడ్డుసైతం అత్యంత దారుణంగా తయారైంది. ఆ రోడ్డు గుండా వెళ్లాలంటేనే జనం భయపడే పరిస్థితి నెలకొంది. చింతలపూడి నుంచి కామవరపుకోట వెళ్లే రోడ్డు, టి.నరసాపురం వెళ్లే రహదారి అత్యంత దారుణంగా ఉన్నాయి. రాఘవాపురం వెళ్లే రోడ్డు సైతం అదేవిధంగా ఉంది. చింతలపూడి నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి ఏమాత్రం బాగోలేదని స్థానిక ఎంఎల్ఎ ఇటీవల జరిగిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సమక్షంలోనూ మొరపెట్టుకున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో రోడ్ల పనులకు సంబంధించి ప్రణాళిక తయారు చేయాలని ఇన్‌ఛార్జి మంత్రి ఆదేశాలిచ్చారు. అధికారులు ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. నిధులిస్తారో, లేదో వేచిచూడాలి. ఉంగుటూరు నియోజకవర్గంలో మండల కేంద్రం నిడమర్రు నుంచి అడవికొలను వెళ్లే ఆర్అండ్‌బి రహదారిపై జనం రాకపోకలు ఆపేశారు. వర్షం వస్తే ఆ రోడ్డుపై వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. వైసిపి ప్రభుత్వ హయాంలోనే ఆ రోడ్డు ఇదేవిధంగా ఉండగా, ఇప్పుడు అంతకంటే దారుణమైన పరిస్థితిలో ఉంది. ఉంగుటూరు మండలంలో చేబ్రోలు పోలీస్ స్టేషన్ నుంచి తల్లాపురం రోడ్డు, రామచంద్రాపురం నుంచి నల్లజర్ల వెళ్లే రోడ్డు పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. పోలవరం మండలంలో బోడిగూడెం, గార్లగొయ్యి, ఇటుకలకోట, గుంజరం వెళ్లే రోడ్డుసైతం అస్తవ్యస్తంగా తయారైంది. దొండపూడి వెళ్లే రోడ్డు అత్యంత దారుణంగా మారడంతో జనం గగ్గోలు పెడుతున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ రోడ్ల పరిస్థితి అత్యంత భయానకంగా తయారైంది.

నిడమర్రు మండలం కేంద్ర నుంచి అడవికొలను వెళ్లే రోడ్డు వర్షం వస్తే ఇలా..

మాటలు తప్ప.. పనులు లేవ్..!

కూటమి ప్రభుత్వం మాటలు చెప్పడం తప్ప పనులు మాత్రం చేయడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. కొత్తగా రోడ్ల పనులకు సంబంధించి ఎటువంటి నిధులూ మంజూరు కాలేదని ఆర్అండ్‌బి అధికారులు చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే రోడ్ల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్పష్టమవుతోంది. అభివృద్ధికి సంబంధించి నియోజకవర్గాలవారీగా యాక్షన్ ప్లాన్‌పై ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. రోడ్లు, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తేనే అభివృద్ధి పనులపై ముందుకెళ్లే అవకాశం ఉంటుందని ఎంఎల్ఎలంతా ఘంటాపథంగా చెప్పారు. దీన్ని బట్టి రోడ్లు, తాగునీరు వంటి ఇతర మౌలిక సదుపాయాలు ఎంత అధ్వానంగా ఉన్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అధికారంలోకొచ్చి ఏడాది దాటినా ఇంకా రోడ్లు వేయకపోవడంతో జనాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జిల్లాలో రోడ్ల సమస్య ఎప్పటికి తీరుతుందో ప్రభుత్వమే చెప్పాలి.

నేడు ఎర్రకాల్వ మిగులు భూముల్లో..

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎర్రకాల్వ మిగులు భూముల సమస్యపై టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం మండలాల పరిధిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ నెల 28వ తేదీ సోమవారం పర్యటించనున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం మండలాల పరిధిలో 1985లో కరాటం కృష్ణమూర్తి జలాశయం పేరుతో ఎర్రకాల్వ రిజర్వాయర్‌ను నిర్మించారని, ఆ సందర్భంగా భూసేకరణ చేసి సంబంధిత రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించారని పేర్కొన్నారు. ఆ నష్టపరిహారంతో వచ్చిన సొమ్ముతో వేరేచోట్ల భూములు కొనుగోలు చేసుకున్నారని, అయితే నాడు రిజర్వాయర్ పేరుతో ప్రభుత్వానికి అమ్మివేసిన భూముల్లో మిగులు భూములను ఇప్పటికీ అక్రమంగా ఆ భూస్వాములే అనుభవిస్తున్నారని విమర్శించారు. భూస్వాములు ఆ భూముల్లో పామాయిల్, జామాయిల్, మొక్కజొన్న, కొబ్బరి పంటలు వేసి ఫలసాయాన్ని అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఒకసారి ప్రభుత్వానికి భూములు అమ్మి నష్టపరిహారం తీసుకున్న తర్వాత భూస్వాములకు ఎట్టిపరిస్థితులలో భూములపై హక్కు ఉండదని, అలాంటి భూములను సాగు చేసి ఫలసాయం పొందడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములు దాదాపుగా 3500 ఎకరాలు ఉన్నాయని, ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని భూమిలేని దళితులు, గిరిజనులు, పేదలకు ఏక్ సాల్ పట్టాలిచ్చి ఆదుకోవాలని వారు కోరుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా దళితులు, గిరిజనులు, పేదల గోడు పట్టడం లేదని, భూస్వాములు, సంపన్నులకు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. ఈ సమస్యపై సిపిఎం గత 10 సంవత్సరాల నుండి పోరాటం సాగిస్తుందని తెలిపారు. ఆ పోరాట ఫలితంగానే ఇటీవల హైకోర్టు కూడా ఆ ప్రాంతంలో ఉన్న స్థానిక దళితులు, గిరిజనులు, పేదలకు ఏక్‌సాల్ పట్టాలిచ్చి ఆ భూములు సాగు చేసుకునే అవకాశం కల్పించాలని తీర్పునిచ్చిందని తెలిపారు. అయితే కొంతమంది అధికారులు భూస్వాముల నుండి లంచాలు తీసుకొని ఆ తీర్పును అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో స్థానిక దళితులకు, గిరిజనులకు, పేదలకు అండగా నిలిచేందుకు, ధైర్యం ఇచ్చి హైకోర్టు తీర్పు ఆధారంగా సాగు చేసుకోమని చెప్పడానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, ఇతర జిల్లా నాయకులు సోమవారం టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లోని ఎర్రకాలవ మిగులు భూముల్లో పర్యటిస్తారని తెలిపారు. అరకబట్టి దున్ని, సాగుచేసే కార్యక్రమాన్ని చేపడతారని, అనంతరం అక్కడి దళితులు, గిరిజనులు, పేదలతో మాట్లాడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు, కార్యకర్తలు, ఎర్రకాలువ మిగులు భూముల ప్రాంత దళితులు, గిరిజనులు, పేదలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రవి విజ్ఞప్తి చేశారు.

ప్రణాళికాబద్ధంగా పి-4 లక్ష్యాలు సాధించాలి

మంత్రి కొలుసు పార్థసారధి



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పి-4 లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులను మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో అమలు చేస్తున్న పి-4 లక్ష్యాలు, వాటి అమలు ప్రగతిపై తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎంపిడిఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పి-4 ప్రగతిపై సమీక్షించారు. నియోజకవర్గంలో ఎన్ని బంగారు కుటుంబాలు ఎంపిక చేశారనేది మండలాలవారీ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దత్తత కోసం అధికారులు చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. త్వరితగతిన నిర్దేశిత లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేయాలని ఆదేశించారు. బంగారు కుటుంబాల ఎంపికలో పారదర్శకత ఉండాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు.

ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

నేటి నుంచి ఇంటింటా ప్రచారం, సంతకాల సేకరణ
5న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు
ప్రజావేదిక సమావేశంలో వామపక్ష పార్టీల నేతలు పిలుపు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. అదానీ వంటి కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై, వినియోగదారులకు భారంగా మారబోతున్న స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు పోరాడాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన ప్రజావేదిక సమావేశంలో వారు ప్రసంగించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు యు.వెంకటేశ్వరరావు (యువి), సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రసంగించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, పెంచిన ట్రూఅప్ ఛార్జీలు, ఇతర భారాలకు వ్యతిరేకంగా ప్రజావేదిక ఆధ్వర్యంలో ప్రచురించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఇప్పటికే అనేక రకాల పన్నుల భారాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ ఛార్జీల రూపంలో మోయలేని భారాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్నాయని విమర్శించారు. 2022 కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణ చట్టంలో భాగంగా రాష్ట్రంలోని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లు బిగిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టేస్తుందని విమర్శించారు. ఇప్పటికే ఆరు రకాల పేర్లతో వసూలు చేస్తున్న ఛార్జీలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ఇప్పుడు స్మార్ట్‌మీటర్ల భారం కూడా ప్రజలపై వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక సెల్‌ఫోన్ వలే ముందుగా రీఛార్జి చేసుకోవాలని, ఎప్పుడు బ్యాలెన్స్ అయిపోతే అప్పుడు కరెంట్ ఆగిపోయే ప్రమాదం ఉందని, దీనివల్ల ప్రజలు మరింత కష్టాలు ఎదుర్కొంటారని వివరించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సోమవారం నుంచి ఇంటింటా ప్రచారం, సంతకాల సేకరణ చేపట్టాలని, ఆగస్టు ఐదో తేదీన జిల్లావ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద, అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలలో విద్యుత్ వినియోగదారులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, సిపిఎం నగర కార్యదర్శి పంపన రవి, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి నాయకులు శ్రీనివాస్ డాంగే, పి.కన్నబాబు పాల్గొన్నారు.

కువైట్‌లో చిక్కుకున్న బయ్యన్నగూడెం మహిళ

స్వదేశానికి రప్పించాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బయ్యనగూడెం గ్రామానికి చెందిన మర్రిపూడి వెంకట రమణ భార్య సుమ (29) కువైట్‌లో చిక్కుకున్నారు. దీనికి సంబంధించి వెంకటరమణ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబాన్ని ఆదుకోవాలనే ఆశతో సుమ మూడు నెలల క్రితం భీమవరంలోని గుమ్మళ్ల వెంకన్న అనే ఏజెంట్ సాయంతో కువైట్ వెళ్లారు. కువైట్ చేరుకున్న తొలి ఐదు రోజులు సుమ తన భర్త వెంకట రమణతో ఫోన్‌లో సంతోషంగానే మాట్లాడింది. ఆ తర్వాత ఆమె ఆరోగ్యం క్షీణించడంతో పరిస్థితి మారిపోయింది. 'నాకు ఒళ్లంతా అలర్జీ వస్తోంది, ఆరోగ్యం బాగో లేదు. నేను ఇంటికి తిరిగొస్తాను' అని ఆమె భర్తకు చెప్పింది. ఈ విషయాన్ని ఏజెంట్‌కు తెలపగా వెంటనే తిరిగి రావడం సాధ్యం కాదని సమాధానం ఇచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న కువైట్‌లో సుమ పని చేసే చోట యజమానులు సుమ ఫోన్‌ను స్వాధీనం చేసుకోవడంతో ఆమెతో కుటుంబానికి సంబంధాలు పూర్తిగా స్తంభించాయి. ఈ క్రమంలో సుమ ఎలా ఉందోనని ఆమె భర్త, ముగ్గురు పిల్లలు, అత్తమామలు ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. 'అమ్మ ఎక్కడుందో, ఎలా ఉందో తెలియదు. అమ్మ గొంతు విని చాలా రోజులైంది' అని సుమ కుమార్తె వందన(9) కన్నీటిపర్యంతమైంది. తన చెల్లి భాగ్యశ్రీ (5) ఒకటో తరగతి చదువుతుందని, తమ్ముడు అభిరామ్ (2) సంవత్సరాలు అని తెలిపింది. తాను గతంలో దుబాయ్‌లో పని చేశానని, ఆరోగ్యం బాగోక వెనక్కు రావడంతో తన భార్య వెళ్లిందని భర్త వెంకటరమణ తెలిపారు. తన భార్యను స్వదేశానికి పంపడానికి లక్షా 50 వేలు అడుగుతున్నారని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

ముంపులోనే గుండేటి వాగు, ఎడవల్లి కాజ్‌వేలు

పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
పోలవరం వద్ద 6,89,259 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

ముంపులోనే గుండేటి వాగు కాజ్‌వే

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గత రెండు రోజులుగా పెరుగుతూ వచ్చిన గోదావరి వరద ఆదివారం నిలకడగా ఉంది. భద్రాచలంలో శనివారం 35.40 అడుగులు ఉన్న గోదావరి వరద ఆదివారం 35 అడుగులకు చేరుకుని నిలకడగా ఉంది. గోదావరి నిలకడగా ఉన్నా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉంది. దీంతో గత రెండు రోజులుగా వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్ల మేర తిరిగి రావాల్సి వస్తోంది. బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారానే రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదావరి వరద నిలకడగా ఉండటంతో మరో నాలుగైదు రోజుల వరకు గుండేటి వాగుపై కాజ్ వే ముంపు నుంచి బయటపడే పరిస్థితి లేకపోవడంతో వాగు అవతల ఉన్న గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

20 గ్రామాలకు రహదారులు దిగ్బంధం

వేలేరుపాడు రూరల్ : గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు వర్షాకాలం ఆసన్నమైతే భయం భయంగా జీవనం గడుపుతూ ఉంటారు. గోదావరి వరదల సమయంలో నిలువ నీడ లేక కొండగుట్టలపై ఆవాసాలు ఏర్పాటు చేసుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సి వస్తుంది. కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతి ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వరకు కూడా 35 అడుగుల మేర నిలకడగా ఉండడంతో కొంత ఊపిరి పీల్చుకున్నా.. ఎడవల్లి వద్ద ఉన్న కాజ్ వే మునిగి ఉండడంతో సుమారు కొయిదా, కట్కూరు, ఎడవల్లి తదితర సుమారు 20 గ్రామాలకు రహదారులు దిగ్బంధమై రవాణా సౌకర్యం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గోదావరి నిలకడగా ఉన్నా కూడా ప్రమాదం పొంచి ఉంటుందని లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి నిర్వాసిత గ్రామాల్లో సర్వేలు చేసినా, ఏళ్లు గడిచినా, ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తమ సమస్యలు తీరడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పోలవరం వద్ద గోదావరి వరద ఉధృతి

దిగువకు 6,89,259 క్యూసెక్కుల నీరు

పోలవరం : పోలవరం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ వస్తుంది. ఆదివారం నాటికి ప్రాజెక్టు ఎగువన గోదావరి నీటిమట్టం పెరిగింది. గోదావరి ఉపనదులు శబరి, సీలేరు, మంజీర, ప్రవర, అపర్ణ, ఇంద్రావతి నదుల నుంచి అదనంగా వస్తున్న 6,89,259 క్యూసెక్కుల గోదావరి జలాలను జలవనరుల శాఖాధికారులు స్పిల్ వే నుంచి దిగువకు విడుదల చేశారు. స్పిల్ వే ఎగువన 31,150 మీటర్లు, దిగువన 22.400 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 31.520 మీటర్లు దిగువ కాపర్ డ్యామ్ దిగువన 21.680 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్ మధ్య 15.880 మీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 10.41 మీటర్లు నమోదైంది.

ఐఐటిలో సీటు సాధించినవారికి ప్రోత్సాహకాలు

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఐఐటిలో అర్హత సాధించిన విద్యార్థులకు తన సొంత నగదు ఎస్‌టిలకు, రూ.లక్ష, ఎస్‌సిలకు రూ.75 వేలు, బిసిలకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందించి ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తానని మంత్రి కొలుసు పార్థసారధి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి ఐఐటీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు తన సొంత డబ్బును వెచ్చించి ఉన్నత చదువులకు ప్రోత్సాహకంగా అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు విద్యపట్ల ఉన్న ఆసక్తి, వారి కృషి, పట్టుదలను గుర్తించాలని, మరింత మంది విద్యార్థులు మంచి చదువులు చదివేలా స్ఫూర్తిని కలిగించాలని భావించి ఈ నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నారు. అందులో భాగంగా దేశంలో ఏ ఐఐటీలో అయినా సీటు సాధించిన నూజివీడు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులకు తన సొంత నిధులను ప్రోత్సాహకంగా అందిస్తానని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకు రావాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని తన వంతుగా ఈ కార్యక్రమం చేపట్టానని తెలిపారు. యువత ప్రత్యేకించి విద్యార్థులు తమ సమస్యలు తెలియచేస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు

బుట్టాయగూడెంలో...

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. సిఐటియు బుట్టాయగూడెం ఐదో మండల మహాసభ ఆదివారం స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో టి.రామలక్ష్మి, మంగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కార్మికులు అత్యంత శ్రమ చేస్తున్న అందుకు తగ్గ వేతనం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయన్నారు. కార్మికుల శ్రమను దోచుకునే విధంగా ప్రభుత్వాలు కార్పొరేట్లకు చట్టాలు చేసి పెడుతున్నాయని విమర్శించారు. కార్మికుల వేతనాలు పెరగడంలేదని, కాని రోజురోజుకి నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటుందన్నారు. చాలీచాలని వేతనాలు ఇచ్చి వారి శ్రమను దోచుకుంటున్నారన్నారు. అధికారంలోకి రాకముందు కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తానన్న కూటమి ప్రభుత్వానికి ఆ ఊసే లేదన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిని పొడిగిస్తూ వస్తుందే తప్ప వారి ఉద్యోగానికి భద్రత కల్పించడం లేదన్నారు. వెంటనే భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కన్వీనింగ్ కమిటీ 12 మందితో ఎన్నికైంది. కన్వీనర్‌గా పూనం శేఖర్, కో కన్వీనర్‌గా తెల్లం రామలక్ష్మి, కమిటీ సభ్యులుగా లక్ష్మీ రాధా, మంగ, అనురాధ, మహాలక్ష్మి, భూదేవి, కె.పుష్ప, జయరాజు, ఇమ్రాన్, కెపోసమ్మ, శిరమయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలుత సిఐటియు జెండాను ఆవిష్కరించారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ముసునూరు :కార్మికులందరూ కలిసి పోరాడితే ఏ సమస్య అయినా పరిష్కరమవుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు సిపిఎం కార్యాలయంలో సిఐటియు మండల మహాసభ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తొలుత సిఐటియు జెండా వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పేద, బడుగు, బలహీన తరగతుల ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతూ ప్రజలను ఇంకా నిరుపేద కుటుంబాలుగా మారుస్తున్నాయని విమర్శించారు. ఆశాలు, అంగన్వాడీలు, ముఠా, పారిశుధ్య కార్మికులకు రూ.26 వేలు ఇవ్వాలని సమ్మెలు, ధర్నాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయంలో 42 రోజులు అంగన్వాడీలు, ఆయాలు, ఉపాధ్యాయులు నిరాహార దీక్షలు చేపట్టినప్పటికీ జగన్ స్పందించకపోగా తీవ్ర ఇబ్బందులు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరిస్తుందన్నారు. సెప్టెంబర్ 4, 5 తేదీల్లో జిల్లా మహాసభలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని, అలాగే 2026 జనవరి 4న విశాఖపట్నంలో జరిగే ఆలిండియా మహాసభలో ట్రేడ్ యూనియన్‌లో ఉన్న వేల మంది మహా కార్మికులందరూ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శివర్గ సభ్యులు కొడవలి శ్రీనివాస్, కంచర్ల రమేష్, కంచర్ల శివప్రసాద్, పిన్నిబోయిన శ్రీను, సిహెచ్.శ్రీను, పి.రాజకుమారి, కె.విద్యావతి పాల్గొన్నారు.

ముసునూరులో...

సిఐటియు మండల కమిటీ ఎన్నిక

మహాసభలో సిఐటియు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కొడవలి శ్రీనివాస్, కో కన్వీనర్లుగా కె.కనకదుర్గ, కె.విద్యావతి, సభ్యులుగా నిర్మల, సునీత, ఏసుబాబు, కె.లావణ్య, పి.నాగరాజు, కంచర్ల రమేష్, సునీత ఎన్నికయ్యారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పూర్వ విద్యార్థులను కలిసి వారితో ఆనందంగా గడిపి మధురమైన క్షణాలను గుర్తు చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి అన్నారు. ఏలూరులోని గాంధీనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో 2001-02 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. ముందుగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులతో కలిసి గడపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులంతా ఆటపాటలతో అలరించారని, ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, లత, గంగాలక్ష్మి, కుటుంబరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు : ఒకటో పట్టణంలోని వెంకన్న ట్యాంక్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభం, 11 కెవి లైన్ మార్పిడి పనుల నిమిత్తం సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అంబేద్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకన్న ట్యాంక్ సబ్ స్టేషన్ పరిధిలోని చిరంజీవి బస్టాండ్ ఏరియా, మార్వాడి గుడి, దక్షిణపు వీధి, మార్కండేయ స్వామి ఆలయం, రాజు గారి మేడ, దొంగలమండపం రోడ్, పాలతూము సెంటర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

త్వరలో భవిత కేంద్ర భవనం నిర్మాణం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు హైస్కూలు ప్రాంగణంలో వికలాంగ విద్యార్థుల సంక్షేమార్థం ప్రత్యేకంగా భవిత కేంద్ర భవనాన్ని నిర్మించేందుకు మోండలెజ్ ఇండియా ఫుడ్ ప్రాడక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ముందుకు వచ్చిందని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. భీమడోలులో భవిత పాఠశాల నిర్మాణానికి సరైన వసతులు లేవన్న విషయం ఆయన దృష్టికి వెళ్లడంతో స్పందించిన ఆయన కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించారు. కంపెనీకి చెందిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) ఫండ్ నుంచి రూ.30 లక్షల కేటాయింపునకు వారు అంగీకరించారు. ఈ మేరకు తమ నిర్ణయాన్ని ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. డిసెంబర్ నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమం నిర్వహిస్తున్న గ్రంథ పాలకులు, సామాజిక కార్యకర్త

గ్రంథాలయాల సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రంథాలయాల సేవలను విద్యార్థులు ఖాళీ సమయాల్లో వినియోగించుకోవడం ద్వారా విజ్ఞానాన్ని సంపాదించి ఉన్నత స్థానాలకు ఎదగాలని సామాజిక కార్యకర్త మండే సుధాకర్ కోరారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో నీతి కథలు చదివించారు. కరెంట్ టాపిక్స్‌పై అవగాహన కల్పించారు. సామాజిక కార్యకర్త విద్యార్థులకు నీతి కథలు చెప్పడంతో పాటు, వాటి సారాంశం, వాటిని జీవనంతో అన్వయవం చేసుకోవడం వంటి అంశాలను వివరించారు. గ్రంథ పాలకుల ఆధ్వర్యంలో పాఠకుల సమక్షంలో భారతరత్న అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

డాంగేనగర్‌లో ఆకతాయిల అల్లర్లు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం డాంగేనగర్ పదో సచివాలయం వద్ద ఆకతాయిల అల్లర్లకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మద్యం తాగి రోడ్డుపై వీరంగం చేస్తూ వాహనదారులు, మహిళల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఆదివారం కొందరు యువకులు మద్యం తాగి రోడ్డుకు అడ్డంగా నిల్చుని దుర్భాషలాడుతూ స్థానిక మహిళల రాకపోకలకు ఆటంకం కలిగించారు. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం తెలిపినప్పటికీ స్పందించలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బహిరంగంగా మద్యపానం తాగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళలు అధికారులను వేడుకుంటున్నారు.

నేరాలు - ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని బోడిగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... బోడిగూడేనికి చెందిన అంజలి (18) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. ఆమె తన పెదనాన్న వాళ్ల వద్ద పెరిగింది. అంజలి ఇంటర్ ఫస్టియర్ వరకు చదువుకుంది. రెండేళ్ల క్రితం చదువు మానేసింది. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన వెంకటకళ్యాణ్‌కు, అంజలికి పెద్దల సమక్షంలో ప్రేమ వివాహమైంది. రెండు నెలల నుంచి వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు కూడా వెళ్లడంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ క్రమంలో ఆషాఢ మాసం ప్రారంభంలో అంజలి పుట్టింటికి వచ్చింది. ఇటీవల ఆషాఢం అయిపోవడంతో కుటుంబసభ్యులు అంజలిని కాపురానికి తీసుకెళ్లాలని ఆమె భర్త వెంకట కళ్యాణ్‌కు తెలిపారు. అయితే వెంకట కళ్యాణ్ "మీరే తీసుకొచ్చి దింపండి" అని సమాధానం చెప్పాడు. ఈ విషయం తెలుసుకున్న అంజలి మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనికి వెళ్లొద్దన్నారని...

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కుటుంబ సభ్యులు పనికి వెళ్లొద్దన్నారని మనస్తాపానికి గురైన మహిళ పందికొక్కుల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండవల్లి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండవల్లి మండలం రుద్రవరం గ్రామానికి చెందిన బి.రంగమ్మ (45) కూలి పనులకు వెళ్తూ ఉంటుంది. ఈ క్రమంలో ఆమెకు అనారోగ్యంగా ఉండటంతో ఆమె భర్త, కుమారుడు పనికి వెళ్లవద్దని, మేము సంపాదించి తెస్తామని తెలిపారు. దీంతో ఆమెకు, కుమారుడికి మధ్య చిన్నపాటి వివాదం తలెత్తింది. మనస్తాపానికి గురైన రంగమ్మ ఆదివారం ఇంటి వద్ద పందికొక్కులు చంపేందుకు వినియోగించే మాత్రలను మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు ఆమెను స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కైకలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటేశ్వరరావు మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ముదినేపల్లి

కాలువలో స్నానానికి వెళ్లి, స్నానం చేస్తూ కాలుజారి గల్లంతైన మదీదు వెంకటేశ్వరరావు మృతదేహం శనివారం లభ్యమైంది. ఈ నెల 24వ తేదీ గురువారం మధ్యాహ్నం కొరరాద గ్రామానికి చెందిన మదీదు వెంకటేశ్వరరావు(59) గ్రామ సమీపంలో ఉన్న క్యాంప్ బెల్ కాలువలో స్నానం చేస్తూ గల్లంతైన విషయం పాఠకులకు తెలిసిందే. గురువారం గల్లంతైన వెంకటేశ్వరరావు కోసం గత రెండు రోజులుగా పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. కాలువలో నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో వెంకటేశ్వరరావు ఆచూకీ తెలియ రాలేదు. దీంతో మూడోరోజు శనివారం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టగా మండలంలోని శ్రీహరిపురం పంచాయతీ శివారు అయినంపూడి వద్ద క్యాంప్ బెల్ కాలువలో వెంకటేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. బంధువులు మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. రెవెన్యూ, ఫైర్ పోలీస్, స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు.

రెయిలింగ్‌ను ఢీకొన్న బైక్ : వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బైక్ అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని లక్ష్మీపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తాడువాయి నుంచి లక్ష్మీపురం వైపునకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి లక్ష్మీపురం సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొట్టి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి
రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రేమ విఫలమై ఆత్మహత్యకు పాల్పడేందుకు యత్నించిన వ్యక్తిని పోలీసులు రక్షించి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... ప్రేమ విఫలం కావడంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని బుట్టాయగూడెం మండలం నిర్వాసితకాలనీ పైడాకులమామిడి గ్రామానికి చెందిన పవన్‌కళ్యాణ్ 112కు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో సమాచారం అందుకున్న బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణంరాజు, కానిస్టేబుల్ సత్యనారాయణ హుటాహుటిన దొరమామిడి వద్దకు చేరుకుని పవన్‌కళ్యాణ్‌ను రక్షించారు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మందుబాబులకు అడ్డాగా అంగన్వాడీ కేంద్రాలు

ఆవరణలో వ్యర్థాలు వేస్తున్న స్థానికులు
సిబ్బంది, చిన్నారుల అవస్థలు
అధికారులు, పోలీసులు స్పందించాలని వేడుకోలు

అంగన్వాడీ వద్ద వ్యర్థాలతో నిండి ఉన్న ప్రాంతం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పే అంగన్వాడీ కేంద్రాలను కొందరూ అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. ఈ పరిస్థితి మండల వ్యాప్తంగా చాలా అంగన్వాడీ కేంద్రాల్లో నెలకొంది. అంగన్వాడీ కేంద్రాలకు సెలవు రోజుల్లో, ప్రతిరోజూ రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. ముదినేపల్లి అంబేద్కర్ కాలనీలోని ఐదో నెంబర్ అంగన్వాడీ కేంద్రం ఇందుకు ఉదాహరణ. అంబేద్కర్ కాలనీలో 23 ఏళ్లుగా అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రం మందు బాబులకు అడ్డాగా తయారైంది. ప్రతిరోజూ రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఇక్కడ మందుబాబులు మద్యం తాగుతున్నారు. ఉదయం కేంద్రం తెలిసే సమయానికి ఆవరణమంతా పేకా ముక్కలు, మందు సీసాలతో నిండిపోతుంది. దీంతో అంగన్వాడీ ఆయా మద్యం సీసాలు, పేకా ముక్కలను తీసి ఆవరణ శుభ్రం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో మందుబాబులు అంగన్వాడీ కేంద్రం ఆవరణలో, అరుగులపై తిష్ట వేసి మద్యం తాగుతూ హల్‌చల్ చేస్తున్నారు. దీనికి తోడు స్థానికులు వ్యర్థాలను తీసుకొచ్చి కేంద్రం వద్ద పడేయటంతో దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులు రాత్రి మిగిలిన అన్నం, కూరలు, చేపలు, రొయ్యలు వ్యర్థాలను తీసుకొచ్చి కేంద్రం వద్ద వేస్తున్నారు. దీంతో అంగన్వాడీ కేంద్రం ఆవరణ అంతా దుర్గంధం వెదజల్లుతుంది. దుర్వాసన కారణంగా కేంద్రంలో విధులు నిర్వహించేందుకు సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. సిబ్బంది ముక్కులు మూసుకుని విధులు నిర్వహించే పరిస్థితి ఏర్పడింది. దీంతో అంగన్వాడీ కేంద్రం తలుపులను మూసివేసి విధులు నిర్వహిస్తున్నారు. ఈ దుర్గంధానికి కేంద్రానికి వచ్చే చంటి పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు. అంతేకాకుండా స్థానికులు కొందరు మరుగుదొడ్లల్లో వాడిన నీరు కూడా తీసుకొచ్చి కేంద్రం వద్ద పారబోస్తున్నారు. కేంద్రం వద్ద వ్యర్థాలు వేయరాదంటూ స్థానికులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదంటూ అంగన్వాడీ కేంద్రం సిబ్బంది వాపోతున్నారు. కేంద్రం వద్ద ఉన్న పంట కాలువలో నీరు పారుదలలేదు. రోడ్డు విస్తరణ పనుల కారణంగా నీటి పారుదల కొన్ని నెలలుగా నిలిచిపోయింది. స్థానికుల వ్యర్థాలు, మందుబాబుల మద్యం సీసాలతో పంట బోదె నిండిపోయింది. దీంతో అంగన్వాడీ కేంద్రం పరిసర ప్రాంతాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు స్పందించి కేంద్రాల వద్ద రాత్రి సమయాల్లో నిఘా ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.


విరాళపు చెక్కు అందిస్తున్న మధు

ఆర్‌సిఎం చర్చి నిర్మాణానికి మధు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బంధంచర్లలో ఆర్‌సిఎం చర్చి నిర్మాణానికి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, వైసిపి జిల్లా రైతు సంఘ అధ్యక్షులు, కె.జగ్గవరం సొసైటీ మాజీ అధ్యక్షులు వాసిరెడ్డి మధు, కుటుంబసభ్యులు రూ.లక్ష చెక్కును విరాళంగా అందించారు. ఆదివారం చర్చి సంఘస్తులకు ఈ చెక్కును అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి మధు మాట్లాడారు. అనంతరం గ్రామస్తులు, చర్చి సంఘస్తులు దాతలు వాసిరెడ్డి మధును, ఆయన కుటుంబ సభ్యులను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థికి మానవత సంస్థ ప్రోత్సాహకం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న మహమ్మద్ యాసీన్‌కు మానవత సంస్థ వారు రూ.పది వేలు ప్రోత్సాహకంగా అందించి ఘనంగా సన్మానించారు. కలిదిండికి చెందిన యాసీన్ ప్రస్తుతం మూడో ఏడాది ఇసిఇ చదువుతున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన రెండో సంవత్సర ఇసిఇ బ్రాంచ్‌లో నాలుగో సెమిస్టర్‌లో వెయ్యి మార్కులకు 995 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా యాసీన్‌కు ప్రోత్సాహకంగా ఆర్థిక సాయం చేసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు కె.సత్యనారాయణ, కలిదిండి అధ్యక్షులు శ్యామలరావు గుప్తా, మాజీ అధ్యక్షులు వూర శ్రీధర్, పి.వివేకానంద, రత్నారావు, జమీల్ అహ్మద్, గోదారి సత్యనారాయణ, తలారి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా విజయరాజు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైసిపి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు పుట్టినరోజు వేడుకలు జంగారెడ్డిగూడెం పట్టణ, పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలోని వైసిపి సీనియర్ నాయకులు పంతగాని వెంకన్న ఇంటి వద్ద పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అధికారంలోకొచ్చేది వైసిపి ప్రభుత్వమేనన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి జంగారెడ్డిగూడెం యూత్ నాయకులు, సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

5న సబ్ స్టేషన్ల వద్ద ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేకుంటే మరొకసారి విద్యుత్ పోరాటం పెద్ద ఎత్తున నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని వామపక్ష పార్టీల నేతలు హెచ్చరించారు. నూజివీడు అమర్ భవనంలో సిపిఐ నియోజకవర్గ సమితి కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన వామపక్ష పార్టీల సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకట రామారావు మాట్లాడారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆగష్టు 5వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నేతలు చేసిన వాగ్దానాలకు విరుద్ధంగా పాలన చేస్తున్నారని విమర్శించారు. ఏడాది పాలనలోనే రాష్ట్ర ప్రజలపై రూ.15,800 కోట్ల విద్యుత్ భారాన్ని మోపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు, సిపిఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు నాగరాజు, సిపిఐ నాయకులు చెంగల వెంకటేశ్వరావు, యాదాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టిడిపి : మంత్రి

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి ప్రతి కార్యకర్తకూ ఎల్లప్పుడూ అండగా ఉంటానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలోని గోపవరం పెద్దమాలపల్లికి చెందిన బల్లవరపు రెడ్డియ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని గోపవరం సొసైటీ ఛైర్మన్, పార్టీ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్‌తో మంత్రి పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని, తానున్నానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, బూత్ కన్వీనర్లు, బూత్ ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం కృషి స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - భీమడోలు

యువత భారతరత్న అబ్దుల్ కలాం ఆశయాల మేరకు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని భీమడోలు ఫొటోగ్రాఫర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. భీమడోలు సంతపేటలో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అబ్దుల్ కలాం, ఫొటోగ్రఫీ సృష్టికర్త డాగ్యురే వేదిక వద్ద ఆదివారం అబ్దుల్ కలాం పదో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షులు పిల్లి బ్రహ్మారావు, అధ్యక్షులు డి.శ్రీరామ్ ఆధ్వర్యంలో కలాం, డాగ్యురే విగ్రహాలకు సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సామాన్యునిగా జీవితం ప్రారంభించి దేశ ఉన్నత స్థాయి పదవికి ఎదిగిన అబ్దుల్ కలాం, శాస్త్ర రంగంలో సైతం దేశాన్ని ప్రపంచ స్థాయిలో ఉన్నత స్థాయిలో ఉంచారని, మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందారన్నారు. యువత ఆయన కృషిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పివిఆర్.మూర్తి, ఎవిఆర్.నాగరాజు, ఎవిఆర్.రంగారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.


పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనది : యుటిఎఫ్

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని ప్రధానోపాధ్యాయులు కొలుసు నాగబాబు అన్నారు. మండలంలోని గుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ అక్కినేని రాజశేఖర్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్, శైలజ దంపతులను యుటిఎఫ్ మండల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుడిమెళ్ల రాంబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉద్యోగ విరమణ పొందిన వారికి భద్రత కల్పించాలంటే ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొలుసు నాగబాబు మాట్లాడుతూ పాఠశాలలో పని చేసే సమయంలో రాజశేఖర్ ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండలాధ్యక్షులు పద్మ కిషోర్, పుల్లయ్య, వరప్రసాద్, సత్యప్రియ, ఎం.నాగమల్లేశ్వరి, నారాయణ, విష్ణు, ఉలాస వెంకటేశ్వరరావు, వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై ప్రజలను చైతన్యం చేయాలి

ప్రజాశక్తి - మండవల్లి

రాజ్యాంగం ప్రజాస్వామ్యంపై ప్రజలను చైతన్యవంతులుగా చేయాల్సిన బాధ్యత ఐక్యవేదిక సభ్యులపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. స్టేషన్ రోడ్డులోని టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో మండల కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనమంతా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామన్న విషయం 95 శాతం ప్రజలకు తెలియడం లేదన్నారు. ప్రతి కార్యాయంలో సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 4(1)ఎ నిర్దేశాలను అనుసరించి సమాచారాన్ని పట్టికలు, పద సూచికలతో సహా క్రమ పద్ధతిలో ఏర్పాటు చేసేలా చేయడంతో పాటు4(1)బితో పాటు దాని నకలు ప్రజలు అడగగానే అధికారులు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయాలను ప్రజలకు తెలియపరచి ప్రశ్నించే విధంగా సమాచారం అడిగి తెలుసుకునే విధంగా సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కలిగించడంతోపాటు చైతన్య పరచాల్సిన బాధ్యత ఐక్యవేదిక సభ్యులపై ఉందన్నారు. సమాచార హక్కు చట్టానికి సమయం వెచ్చించి పనిచేసే యూత్ సభ్యులను, రిటైర్ ఉద్యోగులను ఐక్యవేదిక సభ్యులుగా చేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం జిల్లా కన్వీనర్ టెంటు అప్పారావు, మండల కమిటీ అధ్యక్షుడు గంజాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, చేయబోయిన వెంకట్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఉచిత గుండె వైద్య పరీక్షలు

ఏలూరు సిటీ :ప్రతిఒక్కరికీ వైద్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య క్యాంపును ఏర్పాటు చేసినట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణులు కాగిత కృష్ణచంద్ తెలిపారు. ఏలూరులోని అగ్రహారంలో ఉన్న ఎస్‌విఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మొండూరు సొసైటీ ప్రెసిడెంట్ శివమణి, పెదవేగి సొసైటీ ప్రెసిడెంట్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సెంటినీ హాస్పిటల్ వారు ఉచిత మెడికల్ క్యాంపును ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివమణి మాట్లాడుతూ పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో కాగిత కృష్ణచంద్ అతి తక్కువ ధరలకే వైద్యాన్ని అందిస్తున్నారని తెలిపారు. గుండెకు సంబంధించిన ఎటువంటి శస్త్రచికిత్స అయినా, స్టంట్ వేయడంలోనూ ఆయన అత్యంత అనుభవజ్ఞులైన వైద్యులు అని చెప్పారు. డాక్టర్ కాగిత కృష్ణచంద్ మాట్లాడుతూ ఎన్నో శస్త్ర చికిత్సలు తక్కువ బడ్జెట్‌లో ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. చాలా హాస్పిటల్స్ నుంచి రిఫర్ అయ్యి తమ వద్దకు వస్తున్నారని తెలిపారు. ఇసిజి, 2 డి ఎకో వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా మొదటి గురువారం, మూడో గురువారం ఏలూరు ఎస్‌విఎస్ హాస్పిటల్‌కు వస్తున్నట్లు తెలిపారు.

'పి-4 మార్గదర్శకుల నమోదులో బలవంతం వద్దు'

ప్రజాశక్తి ఏలూరు అర్బన్

పి -4 మార్గదర్శకులుగా ఉపాధ్యాయుల రిజిస్ట్రేషన్లు స్వచ్ఛందం కావాలి కాని, బలవంతం చేయవద్దని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, బి.రెడ్డిదొర ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులు అనేక రకాలైన బోధనేతర ఆన్‌లైన్ వర్కులతో సతమతమవుతున్నారని, వీటితో బోధనకు ఆటంకం కలుగుతుందని తెలిపారు.

పేదలకు అండగా 'మానవత'

మండవల్లి : ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడంలో మానవత సంస్థ ముందుండి ఆర్థిక సహాయం అందిస్తుందని ఆ సంస్థ మండవల్లి శాఖ అధ్యక్షుడు గుడివాడ గణేష్ తెలిపారు. స్థానిక నాగేంద్ర స్వామి ఆలయంలో మండల శాఖ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండవల్లికి చెందిన తల్లిదండ్రులు లేని పేద విద్యార్థి కడిమే అఖిల్‌కు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కడమే అఖిల్ పదో తరగతి మంచి మార్కులతో పాసై ఇంటర్ చదివేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు మానవత సంస్థ దృష్టికి వచ్చిందన్నారు. అఖిల్‌కు పుస్తకాల బ్యాగుతో పాటు కళాశాల ఫీజు నిమిత్తం రూ.6,200 ఆర్థిక సాయాన్ని అందించారు. అంతేకాకుండా పేద మహిళ గుడివాడ లక్ష్మికి నెలవారి నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్, ముల్లపూడి సత్తిబాబు, బొల్లంపల్లి కృష్ణారావు, రాంబాబు, ఏసుబాబు, వెంకట రామారావు, కిన్ని బాబు, శివయ్య, శ్యామ్, గణేష్, బండి దివాకర్, కనకారావు, శ్రీనివాసరావు, మానవత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

దెందులూరు :పెదవేగి మండలం పెదవేగి సెక్షన్ పరిధిలోని 132 కెవి పెదవేగి నుంచి వెళ్లే 33 కెవి రామసింగవరం ఫీడర్‌లో ఆర్‌డిఎస్ఎస్ పథకంలో నూతన లైన్ నిర్మించేందుకు ఈ నెల 28వ తేదీ సోమవారం, 29వ తేదీ మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రెండు రోజులు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు రామసింగవరం పరిధిలోని వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ ముందుగా తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు, మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రెండు విడతలగా రైతులకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేత ఉండదని, కూచింపూడి సబ్ స్టేషన్ నుంచి మైలార్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలుస్తుందని పేర్కొన్నారు.

మహారాజశ్రీ తూ॥గో॥జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, రాజమండ్రి వారి కోర్టులో

O.S. 48/2019

Between:
Nakkella Baburao ...*Plaintiff*
AND
Kesavarapu Venkata Bhaskara Rama Rao and Others ...*Defendants*

To:
D-6: Kesavarapu Sitarama Lakshmi, W/o. late Ramakrishna Rao, D.no. 14-9-14, Narasapuram, W.G.Dt.,
D-7: Kesavarapu Jaya Abhinav, S/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,
D-8: Kesavarapu Jhana Samhitha, D/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,

పై నెంబరు దావాలో 6 టు 8 ప్రతివాదులు అయిన మీకు దావా సమన్లు అమలు నిమిత్తం, ది.**05-08-2025 కి వాయిదా అయివున్నది.** అందు విషయమై మీకు ఏమయినా ఆక్షేపణలు వున్నచో వాయిదా రోజున **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
మద్దూరి శివ సుబ్బారావు
మద్దూరి శివరామ శశిభూషణ్
వి.శ్రీనివాసరావు,పి.ఆర్.పి.యాదవ్
అడ్వకేట్సు, డో.నెం. 46-11-34
రాజమండ్రి దానవాయిపేట
20-7-2025 రాజమండ్రి-3

మార్గదర్శకుల నమోదులో బలవంతం లేదు

జిల్లా అర్థగణాంక అధికారి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వం చేపట్టిన పి-4 భాగంగా పేదలైన బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులుగా ముందుకు వచ్చిన ఉద్యోగులను, ఉపాధ్యాయులను, సచివాలయ సిబ్బందిని ఎవరినీ బలవంతం చేయలేదని, వారి అంగీకారంతోనే, ఇష్టపూర్వకంగా నమోదయ్యారని జిల్లా అర్థగాణాంక అధికారి తెలిపారు. ప్రజాశక్తిలో ఆదివారం ప్రచురితమైన దారి తప్పిన పి-4 కథనంపై ఆయన స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. పి-4 కార్యక్రమం దారి తప్పిందని, దీనిపై ప్రభుత్వం చెప్పిన మాటలకు ఆచరణకు పొంతన లేకుండా పోయిందని, సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి మార్గదర్శకులుగా నమోదు చేశారని ప్రచురించారని తెలిపారు. దీనిలో ఎవరి ప్రోత్సాహం, బలవంతం లేదని, వారి ఇష్టపూర్వకంగానే మార్గదర్శులుగా నమోదయ్యారని ఆయన పేర్కొన్నారు.

'స్మార్ట్ మీటర్లపై అపోహలు నమ్మొద్దు'

ప్రజాశక్తి - ఏలూరు

స్మార్ట్ మీటర్లపై వచ్చే అపోహలు నమ్మొద్దని విద్యుత్ శాఖ ఏలూరు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లతో బిల్లుల మోత శీర్షికలో ప్రజాశక్తిలో ఈ నెల 26వ తేదీన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సర్వీస్ నెంబర్ 1511066103002106 పవర్‌పేట సెక్షన్‌లో సత్యనారాయణ అనే వ్యక్తి జ్యూస్ షాపు నడుపుతున్నారని తెలిపారు. వారికి డిసెంబర్ బిల్లు రూ.1300 వచ్చిందని, జులై బిల్లు రూ.1900 వచ్చిందని ప్రజాశక్తిలో ప్రచురించారని పేర్కొన్నారు. డిసెంబర్‌లో అన్‌సీజన్‌లో బిల్లు తక్కువ వచ్చిందని, జూన్ సమ్మర్ సీజన్‌లో ఎక్కువ బిల్లు వచ్చిందని, వారికి స్మార్ట్ మీటర్ మార్చకముందు కూడా 2024 జూన్‌లో రూ.2286 బిల్లు వచ్చిందని తెలిపారు.

పేరు మార్పు ప్రకటన

THOTA RAMA SWAROOP, S/o.THOTA RAMULU, డోర్‌నెం.2-33/1, రాజరాజేశ్వరినగర్, తంగెళ్ళమూడి, ఏలూరు, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివశించుచున్నాను. ఇప్పుడు నాపేరు **THOTA RAMA SWARUP** (పాతపేరు), **S/o.THOTA RAMULU** నుండి **THOTA RAMA SWAROOP** (కొత్తపేరు) **S/o.THOTA RAMULU** గా మార్చుకున్నాను. ఈరోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్తపేరును ఉపయోగించవలెను.

THOTA RAMA SWAROOP,
S/o.THOTA RAMULU
డోర్‌నెం.2-33/1, రాజరాజేశ్వరినగర్,
తంగెళ్ళమూడి, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 2102 of 2023
Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law) & Authorized Officer, ...Plaintiff
And
Smt.Ch.Rohini ...Defendant
To
Smt.Ch.Rohini, W/o.Ch.Hanmanth Rao, Aged about 48 Years, Occ: Business, R/o.Flat No.303, Swetha Sai Arcade, Srirampuram, NR Saibaba Temple, West Godavari Dist, A.P-534202.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,74,508-05ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 22-08-2025.
In case of your failure to attend before the Court on 22-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.
(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD**-50.

IN THE COURT OF THE VI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 3689 of 2024
Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law) & Authorized Officer, ...Plaintiff
And
Sri.J.V.Narendra ...Defendant
To
Sri.J.V.Narendra, S/o. Trimurthy, Aged about 51 Year, Occ: Business, R/o. Andhra Bank, Velpur Branch, No.5-133(Old), Tanuku(M),Velpur, W.G. District, A.P-534222.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.1,70,566-98ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 04-08-2025.
In case of your failure to attend before the Court on 04-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.
(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD**-50.